


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

"హుష్.. నిశ్శబ్దం" నాయుడు గారు గట్టిగా అన్నారు. అంతే. అందరు నిశ్శబ్దంగా అయ్యారు. సూది పడినా వినిపిస్తోందక్కడ.

"నాయనా సుబ్బూ! శారద ఎక్కడ? పార్వతీశం, నువ్వు ఇక్కడే ఉన్నావా? "చుట్టూ చూసి ఊరివారిని గమనించి చెయ్యి ఎత్తి అభివాదం చేశారాయన. అక్కడే ఉన్న మునసబు, కరణాలను కూడా గమనించాడు. వారిని చూసి బలహీనంగా నవ్వి

"ఉండవలసిన వాళ్ళందరూ ఇక్కడే ఉన్నారన్నమాట!" అన్నారు. అందరు రెండు చేతులతో దణ్ణాలు పెడుతుండిపోయారు.

"అసలేం జరిగింది నాన్నా?" హైమవతి కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ అడిగింది. దానికి జవాబిచ్చే లోగానే కొడుకులని చూశారాయన.

"అమ్మ వెళ్ళి పోయిందిగా?" శిరోముండనం చేయించుకున్న కొడుకులను చూస్తూ అన్నారు కేశవరావుగారు. ఆయన కళ్ళు చెమరించాయి.

"అదృష్టవంతురాలు. దేశమాత సేవలో తరించింది." ఒక్కసారిగా బావురుమంది హైమవతి అప్పటి వరకు కూడగట్టుకున్న ధైర్యం ఆవిరైపోతుండగా.

"హైమా, నీ అన్నదమ్ముల కంటే నువ్వే ధీరవు. ఇక నీ అన్నదమ్ములను మీ వదిన తో పాటు కలిసి చూసుకోవలసినదానివి. సుబ్బారావు మేదకుడు. జాగ్రత్తమ్మా."

“ఇంకెక్కడి ధైర్యం నాన్నా నిన్నీ స్థితిలో చూశాక! పోయిన అమ్మ ఎలాగూ పోనే పోయింది. తిరిగి రాదు. నువ్వు కూడా మాకు అన్యాయం చేసి వెళ్తావా నాన్నా? అసలీ పరిస్థితి ఎలా వచ్చింది నీకు?"
బలహీనంగా నవ్వారు కేశవరావు గారు.

“మీ అమ్మను ఆరోజు అందరు కలిసి పక్కకు తీసుకు వెళ్ళినప్పుడు నేనూ అటు రాబోయాను. పోలీసులలో ఎవరో నా నోరు మూసి లాగి వాన్ లో కుదేశారు. నన్ను ఎక్కడికి తీసుకు వెళ్తున్నారో తెలియనివ్వలేదు. తీసుకువెళ్ళి ఏదో జైల్లో పడేశారు. ఇకపై దేశ స్వాతంత్ర్యం కోసం జరిగే ఎటువంటి పోరాటాలలో పాల్గొనని వ్రాసి ఇవ్వమన్నారు. ఇస్తే వదిలేస్తామన్నారు. నేను ఇవ్వలేదు. నన్ను భరించలేనంతగా కొట్టారు. చెప్పుకోలేని హింసలు పెట్టారు. ఏమి చేసినా "వందేమాతరం" అంటూ భరించాను. ఆ మాట అనవద్దన్నారు. నేను వినలేదు.

వారి జాతీయ పతాకానికి వందనం చేస్తే వదిలేస్తామన్నారు. నేను చెయ్యలేదు. నా ఒక్కొక్క వందేమాతరానికి ఆ కారాగారం గదులలో కిక్కిరిసి ఉన్న అనేక భారతీయుల గొంతులు “వందేమాతరం” అనే నినాదంతో బదులు చెప్పాయి.

మమ్మల్ని కొట్టి కొట్టి వారి చేతులు నెప్పి పెట్టాయేమో! లాఠీలు విరిగాయేమో! కానీ వందేమాతరం అని నినదిస్తున్న మా గొంతులకు మటుకు నొప్పి పెట్టలేదు.

ఎవ్వరికీ తినటానికి సరైన తిండి పెట్టలేదు. దాహానికి నీరు ఇవ్వలేదు. అయినా ఎవ్వరం లొంగలేదు. ఆఖరికి చీరాల నుంచి చాలామంది సత్యాగ్రహులని బంధించి తేవటంతో, ఆ కారాగారంలో చోటు లేక మమ్మల్ని వదిలి వెయ్య వలసి వచ్చింది. ఇంచుమించు లేవలేని స్థితిలో ఉన్న నన్ను, నా లాంటి మరికొందరిని వానుల్లో ఎక్కించి తెచ్చి మన ఊరికి దూరంగా వదిలేశారు.

అందరం కాలిబాట పట్టాము.

నా కళ్ళు తెరుచుకోవట్లేదు, కాళ్ళు కదలట్లేదు. దాహం తో నాలుక ఎండిపోతోంది. చేతిలో ఎర్రని ఏగాని లేదు. నడవలేక,నడవలేక అడుగులు వేస్తూ ఓపిక లేక తూలి పడిపోయాను. నా వొంట్లో పోలీసు దెబ్బలకు గురి అవ్వని భాగం లేదు. రెండు రోజులనుంచి మూత్రం బంధించుకు పోయింది. నాకు తెలుస్తోంది నా సమయం అయిపోయిందని.. కానీ ఒకే కారణంతో ప్రాణాలు నిలుపుకున్నాను నేను.

ఆ పోలీసులు మమ్మల్ని వదిలి పెడుతూ ఒకటే మాట అన్నారు. 'ఎందుకు మీరు పిచ్చివాళ్లలా స్వాతంత్ర్యం, స్వాతంత్ర్యం అంటూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు? మేము ఇచ్చేదీ లేదు, అది వచ్చేదీ లేదు. కొన్నాళ్ళల్లో ఈ ఉద్యమం చప్పబడి పోతుంది. మాదే పాలన' అని. వాళ్ళు కొట్టిన దెబ్బలు, పెట్టిన చిత్రహింసల కంటే ఆ మాటలు నన్నెంతో బాధించాయి. మీ అమ్మ, నేనూ మాలాగా మరెందరో ప్రాణాలను ఒడ్డి చేసిన కృషి వట్టి పోతుందా? మనకు స్వాతంత్ర్యం రానే రాదా? సిగ్గు చేటు. మా వంటి వారి మరణం ఎందరో స్వాతంత్ర్య యోధులకు స్ఫూర్తి కావాలి. మన భారత దేశానికి స్వాతంత్ర్యం అతి త్వరలో రావాలి. ఈ సందేశాన్ని మీ కివ్వటానికే ప్రాణాలను ఉగ్గబట్టుకుని వచ్చాను. మా మరణాలతో ఈ పోరు ఆగకూడదు "

వింటున్న వారి గుండెలు చెరువులయ్యాయి. ఆయన ఆవేదన ప్రతి ఒక్కరినీ తాకి, కదిలించివేసింది. వారి కళ్ళవెంట నీరు ధారాపాతంగా కారసాగింది. అందరిలోనూ దేశభక్తి ఉప్పొంగింది.

"భారత్ మాతాకీ "అరిచారెవ్వరో ఉద్వేగంగా. ఆ గొంతుకి కొన్ని వందల గొంతులు సమాధానమిచ్చాయి

"జై " అంటూ.

"ఒక్కసారి నా కొడుకు, అల్లుడు తప్ప తక్కిన వాళ్ళందరూ దూరంగా వెళ్ళండి."కేశవరావు గారు బలహీనస్వరంతో అన్నారు. అదొక ఆదేశంలాగా అందరూ దూరంగా వెళ్లారు కుటుంబ సభ్యులతో సహా.

"బాబూ, మీ ఇద్దరూ నాకు బాగా దగ్గరకు రండి. నేను చెప్పేది వినండి." సుబ్బారావు, పార్వతీశంలు కేశవరావుగారికి చెరో పక్కనా కూర్చున్నారు. ఆయన వారితో కొంతసేపు మాట్లాడే సరికే నీరసం కమ్ముకుంది. కానీ చెప్పదలచింది చెప్పాననే తృప్తి ఆయన కళ్ళల్లో మెరిసింది.

“చేస్తావు కదూ?” పార్వతీశంని అడిగాడాయన.

"తప్పకుండా మావయ్యా. మీరు విశ్రాంతి తీసుకోండి. తరువాత మాట్లాడవచ్చు.” పార్వతీశం ఆయన్ను వారిస్తూ, ఆచారి గారికి సైగ చేసాడు వచ్చి ఆయన్ను చూడమన్నట్లు. ఆయన ఒక్క పరుగున వచ్చి నాడి చూసి పెదవి విరిచారు. దూరంగా నిలబడ్డ జనమంతా దగ్గరకు వచ్చారు.

"బాబూ పార్వతీశం, సుబ్బారావుకి అండగా, నువ్వూ మా వారసుడిగా ప్రజలకు నాయకుడిగా నిలువ గలవా? ప్రజల స్వాతంత్రాభిలాషకు తోడ్పడగలవా? స్వతంత్ర పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్లగలవా? మన జాతీయ నాయకులకు, ఈ ఊరికి సంధానకర్తగా, అవసరమైతే కుటుంబాన్ని లెక్క చెయ్యకుండా, దేశానికి ప్రాధాన్య మీయగలవా? "

పార్వతీశం భార్య వైపు చూశాడు. హైమ కళ్ళల్లోని సందేశం అతని గుండెను చేరింది.

"తప్పకుండా మామగారూ భారత స్వాతంత్రం కోసం నా ప్రాణాలనైనా విడుస్తాను. ఈ సోదరులతో కలిసి భారత మాత శృంఖలాలను తెంచటానికి నా వంతు కృషి చేస్తాను," మామగారి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు పార్వతీశం దృఢంగా.

కేశవరావు గారి కళ్ళు మెరిశాయి. పెద్దలందరి సమక్షంలో చెప్తున్నాను. నా ఆస్తిలో నా కొడుకులు నలుగురికే కాక నా కూతురికి కూడా ఒక వాటా ఇవ్వాలి. ఇప్పటిలాగానో, ఇంకా ఎక్కువగానో నా కుటుంబం  దేశసేవకి ఖర్చు చేయాలి. ఇది నా అభిమతం. నా ముగ్గురు పిల్లలు పెద్దయ్యే వరకు వాళ్లని నా కోడలు శారద, కూతురు హైమవతులే తల్లులుగా పెంచాలి. హైమ తల్లికి పుట్టింటి వారిచ్చిన ఆస్తి హైమకు స్త్రీ ధనంగా చెందాలి. అందరు విన్నారుకదా.” ఒక్క నిమిషం ఆయాసంతో ఆగారాయన.

“మన ఊరిప్రజలు స్వాతంత్ర పోరాటంలో యోధులుగా పేరుబడాలి. మన ఊరి పేరు స్వతంత్ర పోరాట చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖింప బడాలి. మీ అందరూ అందుకు కృషి చేస్తామని మాట ఇవ్వండి. ఇక మన పోరాటాన్ని పార్వతీశం, సుబ్బారావులు ముందుకు నడిపిస్తారు.మీ అందరికి సమ్మతమేనా?"

అందరు సమ్మతి సూచకంగా చేతులెత్తి ‘భారతమాత కీ జై’ అని నినాదాలు చేశారు.

సుబ్బారావుకి  అశ్రుధారలు ఆగటం లేదు. కేశవరావు గారు అతన్ని చూస్తూ అన్నారు.

"ఒకసారి ముందు గదిలో అమ్మా, నాన్నా, చెల్లితో నేనున్న ఆ ఫోటో తెచ్చి ఇవ్వవూ?" సుబ్బారావు ఒక్క పరుగున వెళ్ళి, గోడకు వేళ్ళాడుతున్న ఫోటోని తెచ్చి ఇచ్చాడు. కేశవరావు గారు ఆ ఫోటోని పార్వతీశంకి చూపిస్తూ అన్నారు.

"అమ్మ, నాన్న, నేను, చెల్లాయి" అక్కడ, ఆ చెల్లెలి ఫోటో దగ్గర ఆయన వేలు ఆగిపోయింది. చిలక ఎగిరిపోయింది. పార్వతీశం ఆ ఫోటోని చేతిలోకి తీసుకుని ఆ చెల్లెలినీ, మిగిలినవారందరినీ మొదటిసారి పరిశీలనగా చూశాడు. దానిని భద్రంగా తన చొక్కా జేబులో పెట్టుకున్నాడు.

18

సుబ్బమ్మగారి మరణం హైమవతికి తీరని లోటైతే, కేశవరావుగారి మరణం పార్వతీశం జీవితాన్నే మార్చేసింది. ముఖ్యంగా ఆయన చివరి కోరిక అతన్ని కదిలించి వేసింది. మృత్యుముఖంలో ఉండి కూడా దేశంగురించే ఆలోచించిన మావగారి నిష్కళంక దేశభక్తి అతనికి దోవ చూపించిందని చెప్పక తప్పదు. అప్పటి వరకు దేశం కోసం చాతనైనంతలో ఏదో చందాలు ఇవ్వటం తప్ప, స్వాతంత్రోద్యమంలో అతను ప్రత్యక్షంగా చేసిందేదీ లేదు. కానీ ఆ క్షణమే అతని ఆలోచనలు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా మావగారు తనలాంటి వారు ఎంతోమంది కారాగారంలో మగ్గిపోతున్నారని, దెబ్బలు తింటున్నారని చెప్పగా విన్న అతనికి, పెద్దలైన మామగారి వంటివారే స్వాతంత్ర్య సమరంలో దెబ్బలు తింటుండగా, యువకులైన తనవంటి వారు ఇంట్లో కూర్చోవటం పిరికితనం అనిపించింది.ఆ క్షణమే అతను ప్రత్యక్షంగా రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నాడు. మావగారి అంత్యక్రియలు ముగిశాక భార్యాభర్తలు వెనక్కి ఇంటికి వచ్చేశారు. వచ్చిన రోజే శయనమ్మగారిని పిలిపించాడు పార్వతీశం.

"ఏవమ్మా ముసలమ్మ గారూ, నేను మా మామగారి ఆదేశానుసారం స్వాతంత్రోద్యమంలో ప్రత్యక్షంగా పాలు పంచుకోవాలని నిర్ణయించుకున్నాను. ఇకనుండి మరి మీరు హైమకు అండదండగా ఉండగలరా? నేను ఇంట్లో లేని సమయంలో ఆమెకు పెద్దదిక్కుగా ఉండి పిల్లల పెంపకంలో సాయం చేస్తారా?" విషయమంతా హైమ ద్వారా అప్పటికే విని వున్నది శయనమ్మ.

"తప్పకుండా బాబుగారూ, అది నా కర్తవ్యం. దేశం కోసం నేను చేసే సేవ అనుకుంటాను," అన్నది ఆమె.

"చాలా సంతోషం. ఇకనుండి ఎక్కువ భాగం నేను ఇంట్లో ఉండక పోవచ్చు. నా కార్యాచరణను ముందు నిర్ణయించుకుని నీకు చెప్తాను." అన్నాడు పార్వతీశం.

“మరి మీరూ నాకో మాట ఇవ్వాలి. నాకు తోచి, నేను చేస్తున్న ఈ సంఘసేవలో మీరూ, అమ్మాయి మీకు కుదిరినప్పుడల్లా పాలు పంచుకోవాలి. మీ సలహాలు, సంప్రదింపులు నాకు కావాలి." నవ్వాడు పార్వతీశం.

"గడుసు దానివే ముసలమ్మగారూ . గట్టి బంధమే వేస్తున్నావు. ఏదైనా దేశం కోసమేగా? నేను సిద్ధమే"

★★★★★

దేశసేవలో పాల్గొనాలనే పార్వతీశం ఉత్సాహానికి తగ్గట్టు గానే స్వాతంత్ర్య ఉద్యమం ఉప్పు సత్యాగ్రహం తరువాత ఊపు అందుకుంది. హిందువులు, ముస్లింలు, సిక్కులు, పారశీలు అందరు దేశస్వాతంత్యం కోసం ఏకమయ్యారు. స్త్రీలు సైతం దేశం కోసం ఉద్యమించటం ఎక్కువయ్యింది. భారత దేశంలో స్వాతంత్ర్యం కోసం సాగుతున్న పోరాటం

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును పొందింది. బ్రిటిష్ పాలకులకు ఉప్పు సత్యాగ్రహం నుంచి దేశంలో పెరుగుతున్న అశాంతి ఒక హెచ్చరికలాగా పరిణమించింది.

కేశవరావు గారి మరణం తరువాత పార్వతీశం దగ్గరకు వచ్చి ఉన్నది సుబ్బారావు కుటుంబం తాత్కాలికంగా. స్వాతంత్ర్యపోరాటంలో చేరారు పార్వతీశం, సుబ్బారావులు.. ప్రజలందరినీ ఏకం చేయసాగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించిన ఎందరో నాయకులను, కార్యకర్తలను కారాగృహానికి పంపింది బ్రిటిష్ ప్రభుత్వం. సుబ్బారావు, పార్వతీశంలు కూడా అలా అరెస్ట్ కాబడ్డారు. కేవలం ఇరవై మూడేళ్ళ వయసులో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్, వారి రక్తంలోని ప్రతిబొట్టులోనూ ఆవేశం నింపాడు. ఆయుధ పోరాటమే స్వపరిపాలనకు మార్గం అనే సుభాష్ చంద్రబోస్, బాఘా జతిన్, సూర్యా సేన్ వంటి వారు పార్వతీశాన్ని, సుబ్బారావును ఆకర్షించినా గాంధీ అనుసరించిన అహింసా మార్గం, శయనమ్మ మార్గ దర్శకత్వం వారిని అతివాదులు కాకుండా కాపు కాసాయి.

బ్రిటిష్ వారు బయటనుండి వార్తలు జైలులోకి రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. జైళ్ళల్లో ఉండేవారి సమాచారం కూడా బయటివారికి పెద్దగా తెలిసేది కాదు. అక్కడ బందీలకు పెట్టే భోజనంలో నాణ్యత పాటించేవారు కారు. వారిని ఉంచిన ప్రదేశాలలో శుభ్రత ఉండేది కాదు. ఎంతటి ఆరోగ్యవంతులనైనా కారాగారవాసం అనారోగ్యం పాలు చేసేది.

కేవలం ఆరునెలల జైలు జీవితం సుబ్బారావు ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీసిందని చెప్పాలి. బయటకు వచ్చే వేళ్టికి ఎముకల పోగయ్యాడు సుబ్బారావు. కసరత్తులు చేసి దృఢంగా ఉండే పార్వతీశం వంటి ఆరోగ్యవంతుడే బలహీనపడినప్పుడు సుబ్బారావు గురించి చెప్పేదేముంది? ఇద్దరినీ ఒకే రోజున విడుదల చేశారు. విడుదల వార్త తెలిసి సుబ్బారావు తమ్ముళ్ళు ముగ్గురూ, అనేకమంది కార్యకర్తలు వారిని ఇంటికి తీసుకు వెళ్ళటానికి వచ్చారు. శారద నిండు నెలల గర్భవతి. హైమవతి, శయనమ్మ గార్ల అండదండలతో భర్త దూరమైన దుఃఖాన్ని నెగ్గుకొస్తోందామె.

ఇంటికి చేరగానే సుబ్బారావు కోసం గుమ్మం లోనే ఎదురు చూస్తున్న శారద అతని పాదాల మీద వాలి పోయింది. నీళ్లు నిండిన కళ్ళతో భార్యను లేవనెత్తాడు సుబ్బారావు. జైలు జీవితం అతని ఆరోగ్యాన్ని చాలా దెబ్బతీసింది. అది మనిషిని చూస్తుంటేనే తెలిసిపోతోంది. నిబ్బరంగా ఉన్నది హైమవతే. భర్తని కళ్ళతోనే పలకరించింది ఆమె. అన్నగారికి, భర్తకు వేడినీళ్లు స్నానం కోసం సిద్ధంచేసి, శయనమ్మ గారి సహాయంతో వంట పూర్తి చేసింది. సుబ్బారావు పరిస్థితిని చూసిన ఆమె మనసు ఆందోళనతో నిండి పోయింది.

"వదినా, అన్నయ్య విశ్రాంతి తీసుకునే ఏర్పాట్లు చూడు. బాగా అలసి పోయాడు." శారద తల ఊపి వెంటనే లోపలి గదిలోకి వెళ్ళింది. సుబ్బారావు పడుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసింది. అతి కష్టం మీద భోజనం ముగించి లోపలికి వెళ్ళాడు సుబ్బారావు. ఆ పడుకోవటం పడుకోవటం అతనికి వొళ్ళు తెలియదు. జ్వరం అతనిని లొంగదీసుకుంది.

వారం రోజులైనా జ్వరం తగ్గక పోటంతో పార్వతీశం వైద్యుడిని పిలిపించి చూపించాడు. ఆయన సుబ్బారావు పరిస్థితి అతను జైల్లో తిన్న ఆహారం వలన పూర్తిగా పాడయ్యిందని, అంతే కాక అతనికి నెత్తురులో ఏదో తేడా వచ్చిందని పెదవి విరిచాడు. తను చెయ్యగలిగిన వైద్యం చేస్తాను కానీ ఫలితం ఉంటుందని, హామీ ఇవ్వలేనన్నాడు. పార్వతీశం డబ్బు ఖర్చుకు చూసుకోకుండా బావమరిదికి ఉత్తమమైన వైద్యం చేయించటం మొదలు పెట్టాడు. కొంచెం కుదుట పడినట్లు ఉంది సుబ్బారావు ఆరోగ్యం.

★★★★★

అది శ్రావణ మాసం. ఆడవాళ్లందరికి ఆ నెల అంటే ఎంతో సంబరం. కొత్తగా పెళ్ళైన ఆడవాళ్లు పుట్టింటికి నోములు పట్టటానికి వచ్చే నెల. ఏ నోములు పట్టక పోయినా అందరు ఆడవాళ్ళు పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ దేవి పూజ తప్పనిసరిగా చేసుకుంటారు. స్త్రీలకు సౌభాగ్యాన్ని, సంపదలను ఇచ్చే తల్లి కదా. ఆ సందర్భంగా కొత్త నగలు పురమాయించుకునే వారెందరో. మామూలుగా అయితే నగల పురమాయింపులో ముందుంటారు శారద, హైమలు కూడా. అయితే మారిన వారి దృక్పధాలు వారిని ఆ ఆలోచనకు పూర్తిగా దూరం చేశాయి. నగలు కొనుక్కోవటం కంటే దేశం కోసం విరాళం ఇవ్వటం వైపే మొగ్గు చూపించాయి వారి మనసులు.

సంప్రదాయ బద్ధంగా చేసుకునే పూజను మటుకు వదులుకోలేదు వదినా మరదళ్ళు. శయనమ్మ గారి ఆధ్వర్యంలో పొద్దున్నే లేచి పూజ చేసుకుని, తొమ్మిది రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యం పెట్టి, తోరణాలు కట్టుకున్నారు. సాయంత్రం ఇరుగుపొరుగులని పిలుచుకుని వాయినాలు ఇచ్చుకుని మురిసి పోయారు. కొంతమంది ముత్తైదువలు వచ్చి వెళ్ళాక,హైమ అన్నది వదినగారితో

"వదినా, ఎవరన్నా వస్తే నేను చూసుకుంటాలే, నువ్వు సావిత్రమ్మ గారింటికి, పార్వతమ్మ గారింటికి వెళ్ళిరా. వాళ్ళు మరీ మరీ చెప్పారు నిన్ను పంపమని. నువ్వొచ్చాక మిగిలిన ఇళ్లకు నేను వెళ్ళి వస్తాలే "

“సరే” అంటూ భర్త ఉన్న గదిలోకి తొంగి చూసింది శారద. సుబ్బారావు నిద్ర పోతున్నాడు.

"అన్నయ్య లేస్తే నేను పళ్ళ రసం ఇస్తాలే. తొందరగా వచ్చెయ్యి."

"ఒక్కసారి చెప్పి వెళతాలే వదినా. రాజుని తయారవ్వమను. తోడుగా వస్తుంది." అంటూ సుబ్బారావు పడుకున్న గదిలోకి వెళ్ళి ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చి పాలు తీసుకు వెళ్ళింది శారద. అంతలోనే పాలు వెనక్కి తెచ్చింది

"వదినా, పాలు తెమ్మని ఐదునిమిషాల్లోనే పడుకున్నారు. లేస్తే పాలు కాస్త వెచ్చచేసి ఇవ్వు. రావే రాజూ, వెళ్ళొద్దాం," అంటూ వాయనాలను తెచ్చుకునేందుకు పెద్ద చేతి రుమాలు వెతికి తీసుకుని బయల్దేరింది శారద. రెండిళ్ళు అనుకున్నది నాలుగిళ్ళయ్యాయి. ఆఖరి ఇంట్లో పసుపు కుంకాలు తీసుకుని, రుమాలు నిండి పోయి, కొంగులో సెనగలు పోయించుకుంది శారద. బయలుదేరుతుండగా మేనల్లుడు ముకుందం వగరుస్తూ పరిగెత్తుకు వచ్చాడు.

"అత్తా, అమ్మ నిన్ను వెంటనే పిలుచుకు రమ్మంది." వాడు రొప్పుతూనే ఉన్నాడు.

"ఉండరా, రాజుకి అరటి పండు ఇస్తారుట. ఆగ మన్నారు."

"అత్తా, పండు ఇవ్వకపోయినా ఫరవాలేదు. నువ్వొచ్చెయ్యి. అమ్మ వెంటనే తీసుకు రమ్మంది.. పండు మళ్ళీ తీసుకోవచ్చు."

"అబ్బబ్బబ్బబ్బ, నువ్వూ, నీ హడావిడి. ఒక్క నిమిషం ఆగు." లేవలేక, లేవలేక లేచింది శారద భారంగా... ఆమె చెయ్యి పట్టుకుని, నడిపించుకు వెళ్ళాడు ముకుందం. శారద ఇల్లు చేరుతుండగానే ఇంట్లోంచి పెద్దగా ఏడుపులు వినిపించాయి. ఏమై ఉంటుంది? ఆమె కాళ్ళు వణికాయి. కళ్ళు తిరిగాయి.ఒకవేళ భర్త కేమన్నా... అంతకు మించి ఆలోచించలేక పోయింది శారద. వణికే కాళ్ళతో ఒక్క పరుగున ఇల్లు చేరింది. అంతే, ఆమె గుండె ఆగినంత పనయ్యింది. వాకిట్లోనే సుబ్బారావు నిర్జీవంగా పడుకోపెట్టబడి ఉన్నాడు.

తన కళ్ళ ఎదుటి దృశ్యాన్ని నమ్మలేక పోతోంది శారద. ఇది నిజమేనా? పేరంటానికి వెళ్లే ముందు కూడా తనతో మాట్లాడాడే! సుబ్బారావు మాటలు గుర్తుకొచ్చాయి శారదకు. పేరంటానికి వెళ్ళటానికి ముందు భర్త పడుకున్న గదిలోకి చెప్పటానికి వెళ్ళే సరికి కళ్ళు తెరిచి తననే తదేకంగా చూడసాగాడు సుబ్బారావు. మంచం మీద పడుకుని తననే చూస్తున్న సుబ్బారావుని చూసి తనకు సిగ్గు ముంచుకు వచ్చింది.

"ఏమిటలా చూస్తున్నారు?" అని కూడా అడిగింది. అప్పుడు తను అద్దంలో చూసుకుంటూ కుంకుమ బొట్టు తీర్చి దిద్దుకుంటోంది.

"నీ నుదిటిన దిద్దుకుంటున్న బొట్టును," అన్నాడు ఒక నిట్టూర్పు విడిచి.

"బాగుంది వరస," విసుక్కుంది తను నవ్వుతూనే. అతని దగ్గరకు వెళ్ళి నుదుటిపై చెయ్యి వేసి జ్వరం ఉందేమో చూసింది. నుదురు వేడిగా ఉంది. తను ఆందోళన పడి,పేరంటానికి వెళ్తున్నానని చెప్పటానికి వచ్చాను. పోనీ ఉండిపోతానండీ "అంది.

"పేరంటాలంటే నీకు ఇష్టంగా. వెళ్ళి త్వరగా వచ్చెయ్యి.పసుపు కుంకుమల కోసం పది ఆమడల దూరమైనా వెళ్ళాలన్నారు పెద్దలు," అని కదూ అతను అంది. తను బయల్దేరబోతుంటే

"శారదా, ఒక్క మాట!" అన్నాడు. తను ఏమిటన్నట్లు చూసింది.

"ఒక వేళ నాకేమన్నా అయితే, నా తమ్ముళ్ళని కన్నబిడ్డల్లా చూసుకుంటావా లేక నీకు పుట్టబోయే బిడ్డ ముద్దు మురిపాలలో పడి నిర్లక్ష్యం చేస్తావా? అసలే వాళ్లకి అమ్మా నాన్నా లేరు."

తనా మాటలకి బిత్తర పోయి చూసింది. నోట మాట రాలేదు. కళ్ళ వెంట నీళ్ళు గిర్రున తిరిగాయి. ఎలాగో అలా గొంతు పెగుల్చుకుని,

"ఏమిటా అశుభం మాటలు? మీ తమ్ముళ్ళు నా సొంత బిడ్డ కంటే ఎక్కువ," అని మాత్రం అనగలిగింది.

“అలా ఏమన్నా జరిగితే హైమ వద్దే ఉండు సుమా. మీ పుట్టింటికి వెళ్ళొద్దులే. వాళ్ళకి భారమవటం ఎందుకు? పైగా మీ వదినలతో నీకు కష్టమవుతుందేమో?" అన్నాడు సుబ్బారావు.

తన కళ్ళ వెంట నీరు ధార కట్టింది.

"ఏమిటండీ ఈ మాటలు? మీకేమీ కాదు. ఆచారిగారు కూడా చెప్పారు కదా. వదినని పిలిచేదా?"

"వద్దు. దాని నెందుకు భయపెట్టటం? నీ కెందుకో చెప్పాలనిపిస్తోంది. నువ్వు అమాయకురాలివి. అండ లేకుండా ఉండలేవు."

"ఇక ఆ మాటలాపండి. పేరంటానికి వెళ్ళి పసుపు కుంకాలు తెచ్చుకుంటానుఅంటే ఇవా మాట్లాడాల్సిన మాటలు? ముందు మీకు వేడి వేడిగా పాలు తెస్తాను. నీరసంగా కనిపిస్తున్నారు.అవి తాగి కాస్త పడుకోండి," అంది. తీరా పాలు తీసుకుని వెళ్ళి చూసేసరికి సుబ్బారావు కళ్ళు మూసుకుని ఉన్నాడు. తను గదిలోంచి వచ్చేసింది. వదిన బలవంతం మీద పేరంటానికి బయలుదేరింది.

తను వచ్చేముందు నిద్ర పోతున్న మనిషి, మరి ఇప్పుడేంటి ఇలా శాశ్వతంగా పడుకుని ఉన్నారు? ఆమెకు మతి పోయింది. ఒక్కసారి వెళ్ళి అతని మీద పడి కుదిపేసింది ఏడుస్తూ.

"ఏవండీ, లేవండీ. ఏమయ్యిందండీ? ఇంతలోకి ఏమయ్యిందండీ? ఇదేమన్యాయమండీ? చూడండి, పేరంటాలకు వెళ్ళి పసుపు కుంకుమలు, వాయినాలు తెచ్చుకున్నాను. తొందరగానే వచ్చేశాను కదండీ. ఇంతలోనే ఇంత తొందరపడి మీరు వెళ్ళిపోయారా? "ఆమె కొంగులోని సెనగలు,పసుపు కుంకుమలు నేలరాలి పోయాయి. కన్నీళ్ళలో ఆమె మొహాన కుంకుమ చెదిరి పోయింది.

ఆమెను చూసి వాడ వాడా కన్నీటి పర్యంతమయ్యింది. నిండు చూలాలైన వదిన గారిని బలవంతాన లేవనెత్తింది హైమ. ముగ్గురు తమ్ముళ్లు అన్నగారిని వదలట్లేదు. శయనమ్మ గారు వాళ్ళనీ వీళ్ళని అడిగి పార్వతీశం ఎక్కడున్నాడో తెలుసుకోవటానికి ప్రయత్నిస్తోంది. పూజసందడి మాసి పోయి కారు చీకట్లు కమ్మి పొయ్యాయి వారి ఇంట్లో. ఇరవై ఒకటి నిండని శారద పసుపుకుంకుమలకు శాశ్వతంగా దూరమయ్యింది.

రచ్చబండ దగ్గర అందరితో మరునాటి కార్యక్రమాన్ని చర్చిస్తున్న పార్వతీశం ఈ దుర్వార్త అంది ఒక్క పరుగున వచ్చాడు. అతన్ని చూడగానే ఎవరన్నా చెప్పెయ్యవచ్చు ఎంతగా చెదిరిపోయాడో. సుబ్బారావు ఆరోగ్యాన్ని చూస్తున్న అతను ఎంత ఆందోళన చెందుతున్నప్పటికీ పైకి ఏమీ లేదనట్లే ఉన్నాడు. వేరే ఎవరికీ చెప్పకపోయినా అతనితో పాటు హైమకి తెలుసు సుబ్బారావు వ్యాధి ప్రాణాంతకమని. అది చెప్పి శారద గుండెల్లో మంట రేపటం వారికి ఇష్టం లేకపోయింది. కడుపులో దాచిపెట్టుకున్న చిచ్చు అంత తొందరగా బలితీసుకుంటుందనుకోలేదు వారు. మరికొన్నాళ్లు అతను ఉంటాడని, జబ్బు నించి కోలుకుంటాడని ఆశించారు. కానీ దైవం వేరే విధంగా తలచాడు.

తన ప్రియమైన బావమరిదే కాక, స్వాతంత్రోద్యమంలో సహచరుడైన సుబ్బారావు మరణాన్ని భరించలేకపోయాడు పార్వతీశం.ఎంత ధైర్యంగా ఉందామన్న అతని వల్ల కాలేదు. ముగ్గురు బావమరుదులని, శారదని చూస్తున్న కొద్దీ అతనిలో ఆవేదన మిన్ను ముట్టుతోంది

శారద పుట్టింటికి కబురు వెళ్ళింది.మనిషిని పంపారు. వార్త తెలిసి శారద తల్లితండ్రులు ఒక్క పరుగున వచ్చారు. కూతురి పరిస్థితిని చూసిన వారి దుఃఖానికి అంతే లేదు. అప్పటి వరకు ఎంతో అదృష్టవంతురాలని అనుకున్న శారద జీవితం ఒక్కసారిగా తలక్రిందులవ్వటాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS